**శ్రీ పయ్యావుల కేశవ్**

**గౌరవనీయ ఆర్థిక శాఖామాత్యుల వారి ప్రసంగం**

**ఫిబ్రవరి 28, 2025**

**గౌరవనీయ అధ్యక్షా!**

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మన రాష్ట్ర బడ్జెట్‌ను మీ అనుమతితో గౌరవ సభ ముందు ప్రతిపాదిస్తున్నాను. ఈ బడ్జెట్ ను ప్రవేశపెట్టడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను.

2. కానీ, ఆర్థిక విధ్వంసకర పరిస్థితులలో బడ్జెట్ ప్రవేశపెట్టడమంటే, ఎంతో క్లిష్టతరమైన అంశంగానే పరిగణిస్తున్నాం. క్లిష్టతరం అని ఎందుకు అంటున్నామంటే.. ప్రతీ శాఖలోనూ ఆర్థిక అరాచకం చేశారు గత పాలకులు. దీంతో ఆయా శాఖలలో లెక్కలను ఓ కొలిక్కి తీసుకురావడానికి చాలా శ్రమించాల్సి వచ్చింది.

3. ఆర్థిక అరాచకం అని మేం చెప్పడం కాదు.. నీతి ఆయోగ్ తన నివేదికలోనే వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ రుణ సామర్థ్యం సున్నాకు చేరుకుందని అంటే మన రాష్ట్రం ఇక అప్పు తీసుకునే వీలు లేని స్థితికి చేరుకుందని వెల్లడించింది. అంటే భారత దేశం మొత్తంలో అప్పు తీసుకునే శక్తి లేని ఏకైక రాష్ట్రంగా మన రాష్ట్రం మిగిలింది. ఈ పరిస్థితులలో బడ్జెట్‌ను ఎలా రూపొందించాలని తలలు పట్టుకుంటున్న స్థితిలో ముఖ్యమంత్రి గారు చెప్పిన మాటలే మార్గదర్శకంగా నిలిచాయి అధ్యక్షా...! 'అణుదాడిలో విధ్వంసమైన హిరోషిమా నగరం లేచి నిలబడగా లేనిది.. ఆర్థిక విధ్వంసం

జరిగిన ఆంధ్రప్రదేశ్ ను తిరిగి నిలబెట్టలేమా..?' అన్న మాటల స్ఫూర్తితో ఈ బడ్జెట్ రూపొందింది అధ్యక్షా...!

4. గత ఏడాది మన రాష్ట్ర ప్రజలు ఎన్.డి.ఎ. కూటమిపై విశ్వాసం ఉంచి నవ శకానికి నాంది పలికారు. రాష్ట్ర ప్రజలు ఈ అపూర్వమైన తీర్పుతో, రాష్ట్రాన్ని సరైన మార్గంలో నడిపించి, వారి ఆకాంక్షలను నెరవేర్చాల్సిన గురుతర బాధ్యతను మా ప్రభుత్వానికి అప్పగించారు. ఈ ఏకపక్ష తీర్పు **'బ్రాండ్ ఆంధ్ర'** పునర్నిర్మాణంలో మా నిబద్ధతకు పునరుత్తేజాన్ని ఇచ్చింది.

5. గత ప్రభుత్వం తమ ఐదేళ్ల పాలనలో సామాన్యులు ప్రశాంతంగా బ్రతకలేని భయానక మరియు అభద్రతా వాతావరణాన్ని సృష్టించింది. గత పాలకుల పాలన అంతా నిర్లక్ష్యం, విధ్వంసం, భావితరాల భవిష్యత్ వినాశనంగా వర్ణించవచ్చు. ఈ విషయాన్ని మనందరం నిరంతరం గుర్తుంచుకోవాలి. రాష్ట్ర విభజన తర్వాత మన రాష్ట్ర పౌరులు ఎంతో శ్రమకోర్చి ముందడుగు వేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఎన్ని ఇబ్బందులు ఎదురైనా 2014-19 మధ్య కాలంలో మన రాష్ట్రం మునుపెన్నడూ చూడని రెండంకెల వృద్ధిని సాధించడమేకాక ప్రజల ఆకాంక్షలను నెరవేర్చింది.

6. అయితే 2019లో వచ్చిన ప్రభుత్వం రాష్ట్ర పురోభివృద్ధికి అడ్డుకట్ట వేసింది. వారి చర్యలతో రాష్ట్ర అభివృద్ధి పురోగమనబాట నుండి తిరోగమన బాట పట్టింది. ప్రజాస్వామ్య వ్యవస్థలు దెబ్బతిన్నాయి. పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమేశారు. యువత దిక్కుతోచని స్థితికి వెళ్ళింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యింది. ప్రజా సంక్షేమాన్ని మరచి కక్ష సాధింపు రాజకీయాలు, ప్రతిపక్షాల నోళ్లు మూయించటం పైనే గత ప్రభుత్వం దృష్టి సారించింది.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ మార్పు అనేది ఒక సాధారణమైన విషయం. అయితే గత ఐదేళ్ల అవినీతి, అసమర్థ పాలనలో ఎదుర్కొన్న కష్టనష్టాల తరువాత 2024లో రాష్ట్ర ప్రజలు తమ జీవితాల గురించే కాకుండా వారి పిల్లల భవిష్యత్తు కూడా ఆలోచించి ఇచ్చినది ఈ అద్భుతమైన తీర్పు.

7. 93 శాతం సీట్లు, 57 శాతం ఓట్ల అసాధారణ మెజారిటీతో ప్రజలు వారి పిల్లల భవిష్యత్తు మరియు సంరక్షణా బాధ్యతలను మా ప్రభుత్వానికి అప్పగించారు. మాప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మన రాష్ట్ర పరిస్థితులను సమీక్షించి, లోతైన విశ్లేషణలు జరిపి శ్వేతపత్రాల ద్వారా గత ప్రభుత్వ దుష్పరిపాలనను బట్టబయలు చేసింది. తద్వారా మన రాష్ట్రం దిశా నిర్దేశం లేకుండా అస్తవ్యస్తంగా ఉందని గుర్తించాము. మన రాష్ట్రంలోని సంస్థలన్నీ నాశనమయ్యాయి, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది, అప్పులు భారీగా పెరిగాయి. మేము పాలనా పగ్గాలు చేపట్టిననాటికి మన రాష్ట్ర పరిస్థితి ఇదే అధ్యక్షా...!

8. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితిలో మన రాష్ట్ర పునర్నిర్మాణం ఎన్నో సవాళ్లతో కూడుకుని ఉంది. దీనిని అధిగమించడానికి ఎంతో ధైర్యం, ఆశావహ దృక్పథంగల నాయకత్వం అవసరం. దార్శనికులు, సంస్కర్త, విధాన మార్గదర్శకులు మరియు అద్భుత మార్పుకు శ్రీకారం చుట్టగలిగిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు నాయకత్వం వహించడం మన భావితరాల అదృష్టం. సవాళ్లను అధిగమించడంలో ఆయనకు ఆయనే సాటి.

9. 1995లో జీతాలు కూడా చెల్లించలేని దయనీయమైన పరిస్థితులలో మన రాష్ట్రం సతమతమౌతున్న సమయంలో గౌరవ ముఖ్యమంత్రిగారు తొలిసారిగా బాధ్యతలు చేపట్టారు. **ప్రతి రంగంలోనూ అనేక సాహసోపేత నిర్ణయాలు మరియు సంస్కరణలు చేపట్టి, నాటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దారు.**

10. మన గౌరవ ముఖ్యమంత్రిగారు నేడు 2024లో నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు కూడా అలాంటి పరిస్థితే పునరావృతమైంది. గత పాలకులు జీతాలు కూడా సకాలంలో చెల్లించలేని స్థాయికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చారు. రాష్ట్రంలోని అన్ని అభివృద్ధి కార్యకలాపాలు నిలిచిపోవడంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. ఇలాంటి పరిస్థితుల్లో బడ్జెట్ ప్రవేశపెట్టడం క్లిష్టతరమైంది.

11. కౌటిల్యుడు అర్థశాస్త్రంలో చెప్పినట్లు

**"సామాన్యుల సంతోషమే రాజు సంతోషం.**
**వారి సంక్షేమమే ఆయన సంక్షేమం."**

**"రాజు తన వ్యక్తిగత ప్రయోజనాలు, సంక్షేమం గురించి ఎన్నడూ ఆలోచించకూడదు.**
**ప్రజల ఆనందంలోనే తన ఆనందాన్ని పొందడానికి ఎల్లప్పుడూ ప్రయత్నించాలి."**

నంద రాజ వంశపు దుర్మార్గపు పాలన తరువాత సుసంపన్నమైన మరియు న్యాయమైన పాలనను స్థాపించడంలో చంద్రగుప్త మౌర్యుడికి కౌటిల్యుడు మార్గదర్శకత్వం వహించినట్లే, గత ప్రభుత్వ పాలనలోని విధ్వంసకర విధానాల తర్వాత గౌరవనీయ ముఖ్యమంత్రి మన రాష్ట్రాన్ని

పారదర్శకత, సంక్షేమం మరియు శాంతి భద్రతలతో కూడిన పాలనతో ప్రగతిపథం వైపు నడిపిస్తున్నారు.

12. మన రాష్ట్ర పునర్నిర్మాణం కోసం మన ముఖ్యమంత్రి గారు నిరంతరం శ్రమిస్తున్నారు. మన రాష్ట్రంలో లభ్యమవుతున్న మౌలిక సదుపాయాల అవసరాలను బేరీజువేసి కొత్త ఆర్థిక వృద్ధి అవకాశాలను గుర్తించి, కొత్త విధివిధానాలతో రాష్ట్ర పురోగమనానికి కావలసిన విధాన సంస్కరణలను తీసుకువచ్చారు.

13. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు మన రాష్ట్రాభివృద్ధి కోసం 1990వ దశకంలోనే విజన్-2020 డాక్యుమెంట్‌ను రూపొందించారు. అప్పటి ప్రతిపక్షాలు ఆ ఆలోచనను విమర్శించాయి. కానీ, నేటి హైదరాబాద్‌ను చూసినట్లైతే వారి విజన్ సాకారమైంది. ఇదే ఆయన దార్శనికతకు, సామర్థ్యానికి నిదర్శనం. మళ్లీ 2024లో, మరొక గొప్ప విజన్‌ని దిశానిర్దేశం చేస్తూ, గౌరవ ముఖ్యమంత్రిగారు స్వర్ణాంధ్ర-2047 కు శ్రీకారం చుట్టి రాష్ట్రాభివృద్ధికి మార్గనిర్దేశం చేశారు. **15 శాతానికి పైగా రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తి (జి.ఎస్.డి.పి.) వృద్ధిరేటును స్థిరంగా సాధించడం, తలసరి ఆదాయాన్ని పెంచడం, పేదరికాన్ని రూపుమాపడంల ద్వారా అభివృద్ధి ఫలాలను అత్యంత అణగారిన వర్గాలకు అందించడమే దీని లక్ష్యం.**

14. మా ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047 దిశగా పనులను మొదలుపెట్టింది. ఇందులో భాగంగా, పాత విధానాలలోని లోపాలను సరిచేస్తూ నూతన ఇసుక విధానం, ఎక్సైజ్ విధానం, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి విధానం 4.0 లాంటి ఎన్నో విధానాలు తీసుకొచ్చింది.

15. అప్పులు చేయడమే తప్ప, అప్పులు తీర్చడాన్ని మరిచిన గత ప్రభుత్వ తప్పుడు విధానాలను సరి చేస్తున్నాం. ప్రభుత్వం కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టడం చూశాం. కానీ గత పాలకుల విధానాల వలన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్నే కాంట్రాక్టర్లు బ్లాక్ లిస్టులో పెట్టి, పనులు చేయడానికి ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. ఆ దుస్థితి నుంచి రాష్ట్రాన్ని తప్పించాం. జూన్ 2024 నుండి రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా ప్రభుత్వాన్ని గాడిలో పెడుతున్న విధానాలను మచ్చుకు కొన్ని తెలియజేస్తున్నాను.

i. జూన్ 12, 2024 నాటికి ఉన్న 23,556 కోట్ల రూపాయల బకాయిలను చెల్లించాము.

ii. అధ్యక్షా...! గత ప్రభుత్వం 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను నిలిపివేసింది. 9,371 కోట్ల రూపాయల బకాయిలను చెల్లించడం ద్వారా, 74 పథకాలను మా ప్రభుత్వం పునః ప్రారంభించింది. దీని వలన కేంద్ర ప్రభుత్వం నుంచి మన రాష్ట్రానికి మరిన్ని నిధులు లభించాయి.

iii. నీటిపారుదల, రహదారులు మరియు ఇతర పనులకు సంబంధించిన 12,735 కోట్ల రూపాయల బకాయిలను చెల్లించడం వలన రాష్ట్ర ఆర్థికవ్యవస్థ పునరుత్తేజితమైంది.

iv. పంచాయితీలు మరియు మున్సిపాలిటీలను బలోపేతం చేయడానికి 2,793 కోట్ల రూపాయల ఆర్థిక సంఘం నిధులను మా ప్రభుత్వం చెల్లించింది.

v. ఎన్.టి.ఆర్. భరోసా, ఎన్.టి.ఆర్. వైద్యసేవ మరియు దీపం 2.0 పథకాలకు 31,613 కోట్ల రూపాయలను మా ప్రభుత్వం విడుదల చేసింది.

vi. మన రాష్ట్ర అభివృద్ధికి ఎన్.డి.ఎ. కట్టుబడి ఉంది. గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి సహకారంతో పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు మరియు అమరావతి రాజధాని ప్రాజెక్టులను మా ప్రభుత్వం మళ్లీ పట్టాలు ఎక్కించగలిగింది.

vii. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మూలధన పెట్టుబడుల కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అందిచే ప్రత్యేక సహాయంలో అయిన ఖర్చు కేవలం 4,090 కోట్ల రూపాయలు మాత్రమే. 2024-25 ఆర్థిక సంవత్సరంలో, మన రాష్ట్రానికి గణనీయంగా 7,200 కోట్ల రూపాయల మేర కేటాయింపులు పెరిగాయని గౌరవ సభకు తెలియజేయడానికి ఎంతో సంతోషిస్తున్నాను. మార్చి 31, 2025 నాటికి ఈ కేటాయింపులు మరింత పెరిగే అవకాశం ఉంది.

viii. మాప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టాక రాష్ట్ర ఆర్థిక వృద్ధి మళ్లీ గాడిలో పడింది. 2024-25 ఆర్థిక సంవత్సరపు మొదటి ముందస్తు అంచనాల ప్రకారం రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తి (జి.ఎస్.డి.పి.) 12.94 శాతం వృద్ధి చెందింది. అన్ని ముఖ్యమైన రంగాలు మరింత బలం పుంజుకున్నాయి. వీటిలో వ్యవసాయం మరియు అనుబంధ రంగాలు 15.86 శాతం, పరిశ్రమలు

6.71 శాతం వృద్ధిని సాధించగా, సేవల రంగం 11.70 శాతం వృద్ధిని సాధించగలిగాయి.

16. జూన్, 2024 నుంచి అతి తక్కువ సమయంలోనే మా ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన ఈ క్రింది ప్రధాన హామీలను నెరవేర్చింది.

i. ఎన్.టి.ఆర్. భరోసా పింఛన్‌లను నెలకు 4,000 రూపాయలకు పెంచడం జరిగింది.

ii. పేదల కోసం 204 అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేయడం జరిగింది.

iii. దీపం 2.0 పథకం క్రింద ఉచిత సిలిండర్లు ఇవ్వడం జరుగుతోంది

iv. అర్చకులు, ఇమామ్‌లు మరియు మౌజన్‌లకు గౌరవ వేతనం పెంచడం జరిగింది.

v. 16,347 ఉపాధ్యాయుల నియామక ప్రక్రియకు మా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

17. అధ్యక్షా..! ప్రభుత్వం చేసే ప్రతి పని ప్రజల ఆమోదంతో చేయాలనేది చంద్రబాబు గారి ఆలోచన. **'నేడు, రేపు మరియు మరునాడు ప్రజలను ఒప్పించి ముందుకు సాగాలి. ప్రజాస్వామ్యంలో ఇది నిరంతర ప్రక్రియ'.** అని ముఖ్యమంత్రి గారు పదే పదే చెబుతారు. బడ్జెట్ అనేది కేవలం కేటాయింపులు మాత్రమే కాదు, ప్రజల ఆశలు.. ఆకాంక్షలు.. అభివృద్ధి,

సంక్షేమం. ఉన్న వనరులతో వీటిని సమతూకం చేయడమే బడ్జెట్ ప్రక్రియ. దీన్ని గత ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసింది. దీంతో ఆర్థిక వ్యవస్థ క్లిష్టతరంగా మారింది. దీన్ని సరిదిద్దే దిశగా.. 2024-25 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ మన రాష్ట్ర దిద్దుబాటుకు పునాది వేసింది. ఇప్పుడు మా ప్రభుత్వం ప్రతి రూపాయినీ లెక్కించి, ప్రతి శాఖతో లోతుగా చర్చించి, ప్రతి అవసరాన్ని గుర్తించి, వారి భవిష్యత్ సవాళ్లను విశ్లేషించి 2025-26 బడ్జెట్‌ను రూపొందించాం అధ్యక్షా..! గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారి సూచనలకు అనుగుణంగా, శాఖలవారీ కేటాయింపులు గౌరవ సభకు ప్రతిపాదిస్తున్నాను.

**వ్యవసాయం మరియు అనుబంధ రంగాలు**

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ **ఎం.ఎస్. స్వామినాథన్** గారి మాటలు నాకు గుర్తుకొస్తున్నాయి.

**"వ్యవసాయం గాడి తప్పితే మరేదీ సక్రమంగా సాగడానికి అవకాశం ఉండదు."**

18. మన రాష్ట్ర వ్యవసాయ రంగం 62 శాతం జనాభాకు ఆసరాగా ఉంటూ, మన ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోందన్నది వాస్తవం. వ్యవసాయ రంగం ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉన్నప్పటికీ, ఈ రంగానికి సంబంధించిన అనేక కీలక పథకాలను అమలు చేయడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వివిధ వ్యవసాయ పథకాల క్రింద చెల్లించవలసిన 5,510 కోట్ల రూపాయల బకాయిలను గత ప్రభుత్వం చెల్లించలేదు. వీటిలో 693 కోట్ల రూపాయల బకాయిలను మా ప్రభుత్వం చెల్లించింది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన క్రింద చేపట్టే డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని గత ప్రభుత్వం

కొన్ని సంవత్సరాలుగా అమలు చేయలేదు.

19. అసలు డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు ఉన్న ప్రాధాన్యత గత పాలకులకేం తెలుసు అధ్యక్షా! డ్రిప్ ఇరిగేషన్ అనేది ఈ దేశంలోనే లేని రోజులలో దాని ప్రాధాన్యతను గుర్తించిన నాయకుడినీ చూశాం.. దేశం అంతటా డ్రిప్ ఇరిగేషన్ ఉన్న ఈ రోజులలో దాన్ని నిర్లక్ష్యం చేసిన గత పాలకుడినీ చూశాం. ఈ సందర్భంగా డ్రిప్ ఇరిగేషన్ ఈ దేశంలోకి తొలి అడుగు ఎలా పెట్టిందనేది ఈ తరానికి తెలియచెప్పాల్సి ఉంది అధ్యక్షా...! డ్రిప్ ఇరిగేషన్ గురించి ఎవ్వరూ ఆలోచన చేయని 90వ దశకంలో ఇజ్రాయిల్ టెక్నాలజీని రాష్ట్రానికి తేవాలన్నారు చంద్రబాబు గారు. అధ్యయనానికి ఇజ్రాయిల్‌కు వెళ్లిన కమిటీలో నేను సభ్యుడిగా ఉన్నాను అధ్యక్షా...! ముగ్గురు ఐ.ఏ.ఎస్. అధికారులను, నన్ను సభ్యుడిగా ఆ కమిటీలో నియమించారు. నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుగారి సూచనల మేరకు దాన్ని అధ్యయనం చేసి అందించిన నివేదిక ఆధారంగా దేశంలోనే తొలిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో డ్రిప్ ఇరిగేషన్ పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించారు. దీనిపై నాటి కాంగ్రెస్ పార్టీ అవహేళన చేసింది. ఆ తర్వాత డ్రిప్ ఇరిగేషన్‌పై జాతీయ స్థాయిలో వేసిన టాస్క్ ఫోర్సుకు ఆయనే నేతృత్వం వహించారు. ఇవాళ డ్రిప్ లేని రాష్ట్రంలేదు.. పొలం లేదు. **వాట్ చంద్రబాబు నాయుడు గారు థింక్స్ టుడే... నేషన్ థింక్స్ టుమారో...** చంద్రబాబు నాయుడు గారు ఇవాళ ఏం ఆలోచిస్తారో... దేశం రేపు అదే ఆలోచిస్తుందనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి అధ్యక్షా...!

20. ఇలాంటి డ్రిప్ ఇరిగేషన్‌ను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కేంద్ర ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ పథకం కోసం విడుదల చేసిన 616 కోట్ల

రూపాయలను గత ప్రభుత్వం దారి మళ్లించింది. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డ్రిప్ ఇరిగేషన్ కోసం 176 కోట్ల రూపాయలను విడుదల చేసి, అదనంగా 85 వేల హెక్టార్లను డ్రిప్ ఇరిగేషన్ క్రింద తీసుకురావడానికి మా ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది.

21. జీవితంలో ఒక్కసారైనా డాక్టర్, లాయర్, పోలీస్ మరియు బోధకుడు అవసరమని చెబుతూ ఉంటారు. కానీ రైతు ప్రతిరోజూ అవసరం.. మూడు పూటలా అవసరం. కాబట్టి అలాంటి అన్నదాతలకు ప్రగాఢ కృతజ్ఞతా భావంతో మేం మరో సూపర్ సిక్స్ హామీని నెరవెర్చడానికి సిద్దమవుతున్నామని తెలియచేయడానికి ఎంతో సంతోషంగా ఉంది. **ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా.. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు ఏటా 20 వేల రూపాయలు అందించేలా కేటాయింపులు చేశామని చెప్పడానికి గర్విస్తున్నాం అధ్యక్షా..!**

22. మా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా 21.87 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు 9 గంటల ఉచిత పగటిపూట విద్యుత్‌ను సరఫరా చేస్తోంది.

23. **చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు అందించే ఆర్థిక సహాయాన్ని 10,000 రూపాయల నుండి 20,000 రూపాయలకు రెట్టింపు చేస్తామనే మ్యానిఫెస్టోలోని మరో హామీని నెరవేర్చడానికి తగిన కేటాయింపులు చేశామని సంతోషంగా ప్రకటిస్తున్నాను.**

2025-26 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయం మరియు అనుబంధ రంగాలకు 13,487 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**పౌరసరఫరాల శాఖ**

24. 'కాలే కడుపుకు పట్టెడన్నం పెట్టడమే మా సిద్ధాంతం' అని చెప్పిన శ్రీ నందమూరి తారక రామారావు గారు.. దాన్ని నిజం చేసే దిశగా 1994 సంవత్సరంలో 2 రూపాయలకే కిలో బియ్యం పథకం ప్రవేశపెట్టారు. దేశం మొత్తం ఈ నమూనానే అనుకరించింది. మన రాష్ట్రంలో ప్రారంభమైన ఈ పథకం, మూడు దశాబ్దాల తర్వాత జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 రూపకల్పనకు ఆధారమైంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు నాణ్యమైన బియ్యాన్ని మా ప్రభుత్వం సరఫరా చేస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నుండి మధ్యాహ్న భోజన పథకం క్రింద ప్రభుత్వ పాఠశాలలకు మరియు సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు ప్రత్యేకంగా ప్యాక్ చేయబడిన నాణ్యమైన బియ్యం సరఫరా చేయబడుతుందని గౌరవ సభకు తెలియజేస్తున్నాను.

25. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ధాన్య సేకరణ ప్రక్రియను మా ప్రభుత్వం మెరుగుపరిచింది. వ్యవసాయ రాబడిలో వరి కొనుగోళ్లకు ఇచ్చే మద్దతు ధర ముఖ్యమైనది అని మనందరికీ తెలుసు. **2024 ఖరీఫ్ కాలానికి గాను, 5.50 లక్షల మంది రైతులకు 32.7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకుగాను మా ప్రభుత్వం 7,564 కోట్ల రూపాయలను 48 గంటలలోనే చెల్లించడం జరిగిందని గౌరవ సభకు సగర్వంగా తెలియజేస్తున్నాను.** వాస్తవానికి 90 శాతం మంది రైతులకు 24 గంటలలోనే చెల్లింపులు జరిగాయి. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్ లో ఉంచిన ధాన్యం కొనుగోలు చెల్లింపులకు సంబంధించిన 1,674 కోట్ల రూపాయలను మా ప్రభుత్వం చెల్లించింది.

26. తన సోదరీమణులను వంటింటి కష్టాల నుండి గట్టెక్కించడానికి మన గౌరవనీయ ముఖ్యమంత్రిగారు 1999 సంవత్సరములో దీపం పథకాన్ని తెచ్చారు. ఈ పథకం సాంప్రదాయ కట్టెలపొయ్యి వాడకం నుండి ఎల్.పి.జి. సిలిండర్‌ల వాడకం వైపుకు పేద మహిళలు మారడానికి దోహదం చేసింది. **'మహిళలు-మహారాణులు' అనే విశ్వాసముతో మా ప్రభుత్వం ఆ వారసత్వాన్ని నేడు కొనసాగిస్తూ దీపం 2.0 పథకాన్ని ప్రారంభించింది.** ఈ పథకం క్రింద 90.1 లక్షల మంది అర్హులైన లబ్దిదారులకు సంవత్సరానికి 3 ఎల్.పి.జి. సిలిండర్‌లను మా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను దీపం 2.0 పథకం కోసం 2,601 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను పౌర సరఫరాల శాఖకు 3,806 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**సంక్షేమ రంగం**

**"ప్రజలకు సామాజిక సంక్షేమాన్ని అందించడమే అధికారం యొక్క ఏకైక విధి"**

*- బెంజమిన్ డిస్రేలి*

27. స్వర్ణాంధ్ర విజన్ - 2047 లక్ష్యాలకు అనుగుణంగా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి మా ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.

28. వృద్ధులను ఓటు బ్యాంకుగా పరిగణించకుండా వారి జీవితాలకు ఆసరా కల్పించడాన్ని, మా ప్రభుత్వం ఒక సామాజిక బాధ్యతగా భావిస్తోంది.

మన గౌరవ ముఖ్యమంత్రిగారు సామాజిక భద్రతను ఆర్థిక కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో చూస్తూ, లక్షల కుటుంబాలకు పెద్ద కొడుకుగా మారి, **35 రూపాయలతో ప్రారంభమైన పింఛన్‌లను ఎన్.టి.ఆర్. భరోసా పింఛన్‌ల పేరుతో ఇప్పుడు 4,000 రూపాయలకు పెంచటం జరిగింది.** దేశంలోనే అత్యధిక సామాజిక భద్రతా పింఛన్‌లను ఇస్తున్న రాష్ట్రం మన రాష్ట్రమే. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఎన్.టి.ఆర్. భరోసా పథకంలో భాగంగా మా ప్రభుత్వం పింఛన్‌లను వివిధ విభాగాలలో 4,000 రూపాయల నుండి 15,000 రూపాయల వరకు లబ్దిదారులకు అందిస్తూ నిజమైన సంక్షేమానికి ఆదర్శంగా నిలుస్తోంది.

29. షెడ్యూల్డ్ కులాల మరియు తెగల విద్యార్థుల విద్య, సామాజిక భద్రత మరియు ఆర్థిక సాధికారతలపై మా ప్రభుత్వం దృష్టి సారించి, వారి కోసం ప్రీ మెట్రిక్ మరియు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలను అందిస్తోంది. మా ప్రభుత్వం మొత్తం 27.39 లక్షల మంది షెడ్యూల్డ్ తెగల సామాజిక-ఆర్థిక అభివృద్ధికి కట్టుబడి ఉంది. వీరిలో 4.93 లక్షల మంది బలహీన గిరిజనులే (పి.వి.టి.జి.). మా ప్రభుత్వం ఐ.టి.డి.ఎ. ప్రాంతాలలోని గిరిజనుల విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి వంటి వివిధ రంగాలలో సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా వారి ఉన్నతికి దోహదపడుతోంది.

30. ఇమామ్‌లు మరియు మౌజన్‌లకు గౌరవ వేతనంగా ఇవ్వవలసిన 90 కోట్ల రూపాయలను ఒక సంవత్సరం పాటు గత ప్రభుత్వం చెల్లించలేదు. **మా ప్రభుత్వం వచ్చిన తర్వాత వారికి గౌరవ వేతనాన్ని నెలకు 15,000**

**రూపాయల చొప్పున చెల్లించాం. నిర్వీర్యమైన వక్ఫ్ బోర్డును పునరుద్ధరించాము. మద్యం లైసెన్సులలో 10 శాతాన్ని కల్లుగీత కార్మికులకు కేటాయించడం జరిగింది. ధూప, దీప, నైవేద్యంలకు 10,000 మరియు అర్చకులకు కనీస గౌరవ వేతనాన్ని 15,000 కు పెంచాం.**

31. ఇంతేగాకుండా, పేదలపై భారాన్ని తగ్గించడానికి, దారిద్ర్యరేఖకు దిగువనున్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ మా ప్రభుత్వం అందిస్తోంది. అలాగే దారిద్ర్యరేఖకు దిగువనున్న, వెనుకబడిన తరగతులకు చెందిన చేనేత అన్నలకు నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్నాం.

32. **చేతివృత్తులు, హస్త కళాకారులు ఇతర సాంప్రదాయ వృత్తుల వారికి గతంలో అండగా నిలిచిన ఆదరణ పథకాన్ని పునః ప్రారంభిస్తున్నాం.** ఈ పథకం అందించే ఆధునిక పనిముట్లు మరియు ఉపకరణాల వినియోగంతో ఉత్పాదకత పెరిగి స్థిరమైన ఆదాయం పొందడానికి దోహదపడుతుంది.

2025-26 ఆర్థిక సంవత్సరానికి షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం 20,281 కోట్ల రూపాయలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమం కోసం 8,159 కోట్ల రూపాయలు, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం 47,456 కోట్ల రూపాయలు, అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం కోసం 5,434 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమం**

అసంబద్ధ సామాజిక కట్టుబాట్లను ధిక్కరించి భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందిన శ్రీమతి సావిత్రిబాయి పూలే గారు ఈ విధంగా అన్నారు....

**'ఒక మహిళకు సాధికారత కల్పిస్తే-**

**మొత్తం సమాజాన్నే ఉద్ధరించినట్లు అవుతుంది'**

33. మా నాయకుడు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు ఈ సిద్ధాంతాన్ని దృఢంగా విశ్వసించి, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు సాధికారత కల్పించిన మొదటి వ్యక్తి. వంటగదికే పరిమితమైన మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా సామాజిక ఉద్యమంలో భాగమయ్యారు. మన రాష్ట్రం స్వయం సహాయక సంఘాల ఉద్యమానికి పర్యాయపదంగా, దేశానికే ఆదర్శంగా నిలిచింది. నేడు మన రాష్ట్రంలో 10 లక్షలకు పైగా స్వయం సహాయక సంఘాలు పని చేస్తూ రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాలలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల ద్వారా సాధించిన ఈ సాధికారత ఎంతగా ఉందంటే, రాష్ట్ర సంక్షేమ విధానాలను మరియు రాజకీయాలను ప్రభావితం చేసే శక్తిగా డ్వాక్రా వ్యవస్థ రూపొందింది.

34. స్త్రీ నిధికి కేటాయించిన నిధులలో 750 కోట్ల రూపాయలను గత ప్రభుత్వం ప్రక్కదారి పట్టించి, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థిక సాధికారతకు ఎంతో విఘాతం కలిగించింది. మహిళల ఆర్థిక

అభ్యున్నతిలో స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషించేలా, మా ప్రభుత్వం ప్రస్తుతం దిద్దుబాటుచర్యలు చేపడుతోంది.

35. సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐ.సి.డి.ఎస్.), మిషన్-శక్తి వంటి పథకాల ద్వారా మహిళలు, పిల్లలు మరియు కౌమారదశలో ఉన్నవారికి తగిన పోషకాహారం అందించేందుకు మా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. మేనిఫెస్టోలోని హామీ మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్రాట్యుటీ మంజూరు చేసిన ఘనత మా ప్రభుత్వానిదే. వృద్ధుల సంరక్షణ కోసం కొత్తగా 12 వృద్ధాశ్రమాలు మంజూరు చేయడం జరిగింది.

2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వృద్ధుల సంక్షేమ శాఖకు 4,332 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**<u>నైపుణ్యాభివృద్ధి</u>**

నైపుణ్యాభివృద్ధి గురించి మన గౌరవనీయ ముఖ్యమంత్రిగారి మాటలలో...

**"జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థలో,**

**నిరంతరం నైపుణ్యాలను మెరుగు పరచుకోవటం చాలా కీలకం."**

36. కాలానుగుణంగా మారుతున్న పరిశ్రమల యొక్క అవసరాలను తీర్చడానికి నైపుణ్యం కలిగిన మానవ వనరులు చాలా ముఖ్యం. మా ప్రభుత్వం శ్రామిక జనాభా నైపుణ్యాలను అంచనా వేసి, అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వారిని తయారు చేసే దిశగా నైపుణ్య గణన

జరుపుతోంది. స్థానిక పరిశ్రమల డిమాండ్‌ను తీర్చడానికి నిరుద్యోగ యువతకు మరియు కళాశాల డ్రాప్-అవుట్‌లకు శిక్షణ ఇచ్చేందుకు, 83 ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థల (ఐ.టి.ఐ.)లో నైపుణ్య కేంద్రాలను (స్కిల్ హబ్స్)లను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం క్రింద అల్పసంఖ్యాక వర్గాల వారి కోసం ప్రత్యేకంగా నాలుగు కొత్త పారిశ్రామిక శిక్షణ సంస్థలను ఏర్పాటు చేయడానికి ఇప్పటికే ప్రతిపాదనలు చేయడం జరిగింది.

2025-26 ఆర్థిక సంవత్సరానికి, నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణా శాఖకు 1,228 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**పాఠశాల విద్య**

37. గత ప్రభుత్వపు దుర్మార్గపు పాలనా కాలంలో రాష్ట్ర విద్యావ్యవస్థపై దృష్టి సారించకపోవడం, నిర్లక్ష్యం మరియు తప్పుడు విధానాలు వలన, మన రాష్ట్రంలోని 2.43 లక్షల మంది విద్యార్థులు బడి మానివేయటంతో వారి భవిష్యత్ ప్రమాదంలోకి నెట్టివేయబడింది.

38. ఇలాంటి పరిస్థితులలో విద్యా వ్యవస్థను చక్కదిద్దే అత్యంత కఠినమైన బాధ్యతను మంత్రి నారా లోకేష్ గారు తన భుజస్కంధాల మీద వేసుకున్నారు. 'నేటి బాలలే.. రేపటి పౌరులనే' భావనతో విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయడం మొదలు పెట్టారు. రిజల్ట్ ఓరియెంటెడ్ ఎడ్యుకేషన్ పై దృష్టి సారించి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి టెక్నాలజీ విషయాలను ప్రధాన పాఠ్యాంశాలుగా తీసుకురావడానికి ఆయన చేసిన ప్రయత్నాలతో మన పిల్లలు ప్రపంచ స్థాయిలో పోటీపడి రాణించడానికి సిద్ధమవుతున్నారు.

సమాజానికి విద్య ఎంత అవసరమో చైనీయుల సామెత ద్వారా వ్యక్తీకరించబడింది:

**"మీరు సంవత్సరానికి ప్రణాళిక వేస్తే, వరి నాటండి..**

**దశాబ్దానికి ప్రణాళిక వేస్తే, చెట్లు నాటండి..**

**జీవిత కాలానికి ప్రణాళిక వేస్తే, ప్రజలకు విద్య నేర్పండి"**

39. పిల్లలకు విద్య అందించడం తల్లిదండ్రులకు భారం కాకూడదని మా ప్రభుత్వం బలంగా విశ్వసిస్తోంది. ఏ కారణం చేతనూ ఏ బిడ్డా విద్యకు దూరం కాకూడదని విశ్వసిస్తున్నాము. **ప్రతి తల్లి తన పిల్లలను పాఠశాలకు పంపేలా ప్రోత్సహించే లక్ష్యంతో, మరో సూపర్ సిక్స్ హామీని అమలు పరిచే దిశగా 'తల్లికి వందనం' పథకాన్ని ప్రారంభిస్తున్నాం. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఈ పథకం క్రింద 15,000 రూపాయల ఆర్థిక సహాయంను అందించనున్నాము.** చదువుకునే ప్రతి విద్యార్థి తల్లికి ఈ పథకాన్ని అందించడానికి కేటాయింపులు జరుపుతున్నాం. ఈ పథకం ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలలలో 1 నుండి 12వ తరగతి వరకు చదువుతున్న పిల్లలకు వర్తిస్తుంది.

40. అదేవిధంగా, **సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకం** ద్వారా 35.69 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు.. **డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం** ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నాం.

41. ఉపాధ్యాయులకు స్నేహపూర్వక వాతావరణంతో కూడిన విద్యా వ్యవస్థ కోసం గౌరవనీయ మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్

గారి చొరవతో, మా ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్తును అందించాలని నిర్ణయించిందని గౌరవ సభకు ఎంతో సంతోషంతో ప్రకటిస్తున్నాను. ఇది స్థానిక సంస్థలపై ఆర్థిక భారాన్ని తగ్గించడమేగాక ఉపాధ్యాయులు మరియు విద్యార్థులకు ఒత్తిడి లేని వాతావరణాన్ని కల్పిస్తుంది.

2025-26 ఆర్థిక సంవత్సరానికి పాఠశాల విద్యాశాఖకు 31,805 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**ఉన్నత విద్య**

42. భవిష్యత్ సవాళ్లకు విద్యార్థులను సిద్ధం చేయడం మరియు అందరికీ సమాన అవకాశాలను కల్పించడం కోసం బలమైన, సమ్మిళిత ఉన్నత విద్యావ్యవస్థను నిర్మించడానికి ప్రభుత్వం అంకితభావంతో ఉంది. ఈ కార్యక్రమం క్రింద మల్టీ డిసిప్లినరీ విద్య మరియు పరిశోధన విశ్వ విద్యాలయాల స్థాపన, పాలిటెక్నిక్ విద్యలో క్రెడిట్ ఆధారిత వ్యవస్థను ప్రవేశపెట్టడం, అధునాతన తరగతి గదులు, ప్రయోగశాలలు, డిజిటల్ లైబ్రరీలతో విద్యాలయాలను ఆధునీకరించడం వంటి కీలక నిర్ణయాల ద్వారా మన విద్యార్థులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణముగా తయారు చేస్తున్నాము. **ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ 100 విశ్వవిద్యాలయాలలో మన రాష్ట్ర విశ్వ విద్యాలయాలను నిలపడమే మేము లక్ష్యంగా పెట్టుకున్నాము.**

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉన్నత విద్యాశాఖకు 2,506 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## ఆరోగ్య రంగం

43. గత ప్రభుత్వ పాలనలో ఆరోగ్య రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన విషయాన్ని మనం చూశాం అధ్యక్షా...! సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతో మందుల కొరత, సౌకర్యాల కొరత, సేవల కొరతకు కారణమైంది అధ్యక్షా...! వైద్య రంగంలో దాదాపు 6,400 కోట్ల రూపాయల బకాయిలను వారసత్వంగా ఇచ్చారు అధ్యక్షా...! దీనిలో 1,624 కోట్ల రూపాయలను చెల్లించి తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నాలు ప్రారంభించాం.

44. నిర్లక్ష్యానికి గురైన వైద్యారోగ్య రంగాన్ని గాడిలో పెట్టడమే కాకుండా.. ఈ శాఖకు సంబంధించి.. ప్రజారోగ్యానికి సంబంధించి మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం. దీంట్లో భాగంగా.. ఇప్పటికే ఉన్న **ఎన్.టి.ఆర్. వైద్య సేవ పథకానికి** తోడుగా.. ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు.. పేద, మధ్య తరగతి ప్రజలకు ఆస్పత్రులకు వెళ్లిన వెంటనే ఎలాంటి ఇబ్బంది లేకుండా.. కార్పోరేట్ వైద్యం అందేలా పథకాన్ని రూపొందించాం. దీనిలో భాగంగా.. **ప్రతి కుటుంబానికీ 25 లక్షల రూపాయల 'ఆరోగ్య బీమా పథకం' అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు మా ప్రభుత్వం ప్రణాళికలు చేపట్టింది.** ఈ ఏడాదిలోనే ఈ పథకాన్ని అమల్లోకి తేనున్నాం. దీంతో పాటు ఆస్పత్రులలో మందుల సరఫరా, మెరుగైన వైద్య సేవలు, పారిశుద్ధ్యం వంటివి ఇప్పటికే చేపడుతున్నాం అధ్యక్షా...!

2025-26 ఆర్థిక సంవత్సరానికి వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖకు 19,264 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి**

**గ్రామాలు శక్తి సంపన్నమై, స్వయం సమృద్ధి మరియు**
**సాధికారతలతో తులతూగకపోతే దేశాభివృద్ధి**
**అసంపూర్తిగానే ఉండిపోతుంది.**

*- దీన్‌దయాళ్ ఉపాధ్యాయ*

45. గ్రామీణ ప్రాంతాల అవసరాలను తీర్చాల్సిన బాధ్యతను గత ప్రభుత్వం విస్మరించింది. రహదారులు, త్రాగునీరు వంటి కనీస అవసరాలను పొందడం ప్రజల హక్కు అయినప్పటికీ, గత ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టలేదు. స్థానిక సంస్థల నిధులను ప్రక్క దారి పట్టించడం వలన మన రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఇది ప్రభావం చూపి గ్రామ పంచాయితీల హోదాను దిగజార్చింది.

46. గౌరవనీయ ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి మార్గదర్శకత్వంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో మా ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిలో ముందడుగు వేస్తోంది. ప్రజల చురుకైన భాగస్వామ్యంతో మా ప్రభుత్వం సమగ్ర గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి, గ్రామాలలో సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు, పశువుల పాకలు తదితర 30 వేల పనులను మంజూరు చేయడం జరిగింది. **4,300 కిలోమీటర్ల మేరకు మంజూరైన సి.సి.రోడ్లలో, ఇప్పటికే 3 వేల కిలోమీటర్ల మేర రోడ్లు పూర్తయ్యాయి. మరో1,300 కి.మీ. మేర రోడ్ల నిర్మాణం తుది దశలో ఉన్నాయి.** వీటి ఫలితంగా గ్రామీణ ప్రాంతాలలో పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడి, ఆర్థిక కార్యకలాపాలు, ఉపాధి కల్పన జరిగింది.

47. గత ప్రభుత్వం ఐదేళ్లుగా స్మార్ట్ ఎల్.ఇ.డి. వీధి దీపాల కార్యక్రమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. 150 కోట్ల రూపాయల మేర బకాయిలను చెల్లించడం ద్వారా మా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని పునరుద్ధరించింది.

48. కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను ఆగస్టు 15, 2019లో ప్రారంభించినప్పటి నుండి 2024-25 వరకు 13,499 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం కేటాయించినప్పటికీ, గత ప్రభుత్వం మన రాష్ట్ర వాటాను సకాలంలో విడుదల చేయకపోవడం వలన కేవలం 2,255 కోట్ల రూపాయలను మాత్రమే వినియోగించుకోగలగడం జరిగింది. ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, గుజరాత్, ఒడిశా వంటి రాష్ట్రాలు 2023-24 సంవత్సరానికి కేంద్రం నుంచి మనకంటే తక్కువ కేటాయింపులు పొందినప్పటికీ, మన రాష్ట్రం కంటే ఎక్కువ నిధులను వినియోగించుకున్నాయి. మా ప్రభుత్వం ఈ పథకాన్ని పునరుద్ధరించడానికి చొరవ తీసుకుంది. మా ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఈ పథకం గడువును 2028 వ సంవత్సరం వరకు పొడిగించిన కేంద్ర ప్రభుత్వానికి ఈ గౌరవ సభ ద్వారా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. దీనిలో భాగంగా సుస్థిర ఉపరితల నీటి రిజర్వాయర్‌ల నుండి 95.44 లక్షల గ్రామీణ గృహాలకు త్రాగునీరు అందించాలని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

49. **మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం** క్రింద 45.30 లక్షల కుటుంబాలకు చెందిన 72 లక్షల మందికి ఉపాధి కల్పించడం జరిగింది. మా ప్రభుత్వం రైతులకు మేలు చేకూరేలా పొలాలకు అనుసంధాన రహదారులను వేస్తోంది. అన్ని గ్రామాలలో స్వచ్ఛభారత్ మిషన్ క్రింద ఘన మరియు ద్రవ వ్యర్థాల నిర్వహణ కార్యకలాపాలు చేపట్టడం వలన, అవి పరిశుభ్రమైన మరియు ఆదర్శ గ్రామాలుగా మార్పు చెందనున్నాయి.

50. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, రోడ్ల నిర్మాణం విషయంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యాల వలన భయకంరమైన భరింప శక్యం కాని వారసత్వం మా ప్రభుత్వానికి వచ్చింది అధ్యక్షా...! పల్లెల్లో ఎక్కడ చూసినా.. గుంతలమయమైన రోడ్లే కన్పించాయి. వంతెనలు లేక కనెక్టివిటీ లేని గ్రామాలకూ అనుసంధానం ఏర్పడుతున్న ఈ రోజులలో రోడ్లు సరిగా లేక గ్రామాలకు అనుసంధానం లేని పరిస్థితి గత ప్రభుత్వంలో ఏర్పడింది. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పి.ఎం.జి.ఎస్.వై.), ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారుల అనుసంధాన ప్రాజెక్టు మరియు జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణ అభివృద్ధి బ్యాంకు (నాబార్డు) నిధుల క్రింద ఈ రోడ్లను అభివృద్ధి చేసే ప్రయత్నాలు ప్రారంభించాం. అన్ని వాతావరణ పరిస్థితులను తట్టుకోగలిగే రహదారులను నిర్మించి అనుసంధానతను కల్పించే దిశగా పి.ఎం.జన్‌మన్ పథకం మన రాష్ట్రంలో అమలు చేయబడుతోంది.

2025-26 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు 18,847 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**పట్టణాభివృద్ధి**

51. వేగంగా పెరుగుతున్న జనాభా దృష్ట్యా సమర్థవంతమైన పట్టణ ప్రణాళికను రూపొందించడం చాలా ముఖ్యం. పెరుగుతున్న పట్టణీకరణ అవసరాలను తీర్చడానికి అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న నగరాలు మౌలిక సదుపాయాలను కలిగి ఉండాలి.

52. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసేలా ప్రణాళికాబద్ధంగా వికేంద్రీకరణ మంత్రాన్ని జపించిన గత ప్రభుత్వం.. బిల్లుల చెల్లింపుల విషయానికొచ్చేసరికి మాత్రం కేంద్రీకృత విధానాన్ని అమలు చేసింది. ఉదాహరణకు మున్సిపాలిటీలలో చేసే చెల్లింపులను గత ప్రభుత్వం కేంద్రీకృతం చేసింది అధ్యక్షా..! దీని ద్వారా స్థానిక స్వపరిపాలన స్ఫూర్తికి గత ప్రభుత్వం పాతరవేసింది. మారుమూల మున్సిపాలిటీలోని ఓ చిన్న మురుగునీటి కాలువల నిర్మాణానికి సంబంధించిన బిల్లులను సైతం రాష్ట్ర సచివాలయంలోని ఆర్థిక శాఖ కార్యదర్శే చెల్లింపులు జరిపే విధానాన్ని అమలు చేసింది. కేంద్రీకృత చెల్లింపుల విధానం నుంచి మున్సిపాల్టీలకు ఆర్థిక స్వేచ్ఛను కల్పించాలన్న **గౌరవ ముఖ్యమంత్రి గారి ఆలోచనలకు అనుగుణంగా... ఏప్రిల్ 1, 2025 నుండి మున్సిపాలిటీల బిల్లుల చెల్లింపును కేంద్రీకృత విధానం నుంచి వేరు చేసి బిల్లులు చెల్లించే అధికారాన్ని మున్సిపాలిటీలకే ఇస్తున్నాం.** స్థానిక సంస్థలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించడం వాటి పని తీరు మెరుగు పరచడానికి ఇదొక విప్లవాత్మక నిర్ణయం.

**ప్రజా రాజధాని - అమరావతి**

53. అసంబద్ధ రాష్ట్ర విభజన కారణంగా రాజధానిని కోల్పోయిన మన రాష్ట్రానికి అమరావతిని ప్రజా రాజధానిగా ఏర్పాటు చేసుకున్నాం. దీనికి ఆనాడు ఆమోదం తెలిపి.. అధికారంలోకి రాగానే మాట మార్చారు. మాట మార్చడమే కాకుండా.. అమరావతి విధ్వంసానికి నడుం బిగించారు. నాటి ప్రభుత్వ అరాచక విధానాలపై అమరావతి రైతులు పోరుబాటను ఎంచుకోవడం... తమను తాము కాపాడుకుంటూ ఈ రాష్ట్ర రాజధానిని

కూడా కాపాడుకునేలా అమరావతి రైతుల చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను అధ్యక్షా...! తిరిగి రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా.. రాజధాని పనులను పెద్ద ఎత్తున చేపట్టేందుకు సిద్దంగా ఉన్నామని చెప్పడానికి సంతోషిస్తున్నాను అధ్యక్షా...! రాజధాని అనేది ఓ ప్రాంతం కోసం కాదు... రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేసే గ్రోత్ ఇంజిన్‌గా అమరావతిని తీర్చిదిద్దాలని మా ప్రభుత్వ లక్ష్యం.

54. మహారాష్ట్ర అభివృద్ధికి ముంబై ఎంత కీలకమో, తెలంగాణ వృద్ధికి హైదరాబాద్ ఎంత ముఖ్యమో, మనరాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడానికి అమరావతి నిర్మాణం కూడా అంతే అవసరం. గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి సహకారంతో, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు మరియు ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా అమరావతిని ముంబై మరియు హైదరాబాద్‌లతో సరితూగే ఆర్థిక శక్తిగా అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం కృషి చేస్తోంది. అమరావతిని విధ్వంసం చేసేందుకు నాటి పాలకులు చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తు చేయాలనుకుంటున్నా అధ్యక్షా...! రాజధాని నిర్మాణం కోసం అంత డబ్బులు ఇవ్వలేం... కాబట్టే మూడు రాజధానుల ఏర్పాటు అన్నారు... ఇవాళ మేం రాజధాని పనుల నిర్మాణం కోసం బడ్జెట్ నుంచి ఒక్క రూపాయి కూడా కేటాయించడం లేదు. కానీ రాజధాని పనులు ప్రారంభం కాబోతున్నాయి. మా ముఖ్యమంత్రి గారు చెప్పిన విధంగా అమరావతి సెల్ఫ్ సస్టైనబుల్ ప్రాజెక్టు అని నిరూపితమైంది. తనకు తానే ఆర్థిక వనరులు సంపాదించుకునే ప్రాజెక్టు అమరావతి. అది నిజమని కళ్లముందు కనపడుతోంది. ప్రపంచ బ్యాంకు,

ఆసియా అభివృద్ధి బ్యాంక్ మరియు హడ్కో వంటి ఆర్థిక సంస్థల సహకారంతో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమరావతికి నిధులు సమకూర్చే ఏర్పాటును మా ప్రభుత్వం చేసింది. దీనితో రాష్ట్ర బడ్జెట్ సహాయం లేకుండానే స్వీయ పెట్టుబడి వనరులు కలిగిన రాజధాని నగర ప్రాజెక్టుగా 'అమరావతి' మారింది.

55. మా ప్రభుత్వం మున్సిపాలిటీల పరిధిలో చెత్త సేకరణకు వేసిన చెత్త పన్నును రద్దు చేసింది. చెత్తపన్ను ప్రస్తావన వచ్చిన నేపథ్యంలో ఓ విషయాన్ని సభ దృష్టికి తీసుకు రాదలిచాను అధ్యక్షా...! మీరు నాడు ప్రతిపక్షంలో ఒక మాట అన్నారు. చెత్త మీద వేసిన చెత్త పన్నును ప్రస్తావిస్తూ... నాటి పాలకుల మీద మీరు చేసిన వ్యాఖ్యలు పెను ప్రకంపనలు సృష్టించాయి. అది అక్షరాలా నిజమని ప్రజలు తమ జూన్, 2024 తీర్పు ద్వారా స్పష్టం చేశారు అధ్యక్షా..! గత పాలకులు రాష్ట్రానికి అప్పులనే కాదు... చెత్తను కూడా మనకు వారసత్వంగా వదిలేసి వెళ్లారు. రాష్ట్రంలో 83 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ఎత్తకుండా వదిలి పెట్టి వెళ్లిపోయింది గత ప్రభుత్వం. కూటమి ప్రభుత్వం చెత్త పన్నును రద్దు చేయడమే కాకుండా మళ్లీ స్వచ్ఛాంధ్ర దిశగా పని చేస్తోంది అధ్యక్షా..! పట్టణ పేదలకు రాయితీపై ఆహారాన్ని అందించే 204 అన్న క్యాంటీన్‌లను ఇప్పటికే ప్రారంభించడం జరిగింది.

2025-26 ఆర్థిక సంవత్సరానికి పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖకు 13,862 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**గృహ నిర్మాణం**

56. గృహ నిర్మాణ పథకాల క్రింద 4,737 కోట్ల రూపాయలను గత ప్రభుత్వం చెల్లించకపోవడం వలన 4 లక్షల మంది లబ్దిదారులు నష్టపోయారు. గృహ

నిర్మాణానికి షెడ్యూల్డ్ కులాల వారికి అదనంగా 50 వేల రూపాయలు మరియు షెడ్యూల్డ్ తెగల వారికి అదనంగా 75 వేల రూపాయలు ఆర్థిక సాయంగా అందించాలని మా ప్రభుత్వం నిర్ణయించింది.

57. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు మా ప్రభుత్వం గత 7 నెలలలో అసంపూర్తిగా ఉన్న 1.15 లక్షల బలహీన వర్గాల వారికి చెందిన ఇళ్లను పూర్తి చేయడం జరిగింది. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పి.ఎం.ఎ.వై.) పథకాల క్రింద 2026 మార్చి నాటికి 7 లక్షలకు పైగా ఇళ్లను పూర్తి చేయాలని మా ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. అలాగే జూన్ 2025 నాటికి 2 లక్షల ఇళ్లను ఆంధ్రప్రదేశ్ టౌన్ షిప్ మరియు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ (ఎ.పి.టిడ్.కో) ద్వారా అందించనున్నాము.

2025-26 ఆర్థిక సంవత్సరానికి గృహనిర్మాణ శాఖకు 6,318 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**జలవనరులు - కరువు రహిత** ఆంధ్రప్రదేశ్ దిశగా

**"ఈ భూమిపై ఏదైనా అద్భుతం ఉందంటే.. అది నీరే"**

- *లోరెన్ ఐస్లీ, అమెరికన్ ఆంత్రోపాలజిస్ట్.*

ఈ మాట నీటి ప్రాధాన్యతను వివరిస్తోంది అధ్యక్షా...!

58. సాగునీటి రంగాన్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఈ రంగాన్ని విధ్వంసం చేసింది. నీటి కోసం ఎదురు చూసే రాయలసీమ, ఉత్తరాంధ్ర రైతులను నట్టేట ముంచింది. జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టు మొదలుకుని.. పల్లెల్లో పిల్ల కాలువల నిర్వహణను కూడా సరిగా

పట్టించుకోకుండా వదిలేసింది. నిర్లక్ష్యం వలన గత ప్రభుత్వ హయాంలో కొట్టుకుపోయిన డ్యాములను చూశాం.. వాటి వైపు కన్నెత్తి చూడని పాలకుడిని చూశాం. మరోవైపు తుంగభద్ర డ్యాములో గేట్లు కొట్టుకుపోతే.. తెల్లారక ముందే పొరుగు రాష్ట్రానికి పరుగులు పెట్టించిన నేటి పాలకుడిని చూస్తున్నాం. ఇది మాకున్నటువంటి చిత్తశుద్ధి. గరిష్ఠ స్థాయిలో 10 వేల కోట్ల రూపాయలకు పైగా బిల్లుల బకాయిలు ఉండడంతో అన్ని సాగునీటి ప్రాజెక్టుల పురోగతి కుంటుపడింది. తమ కక్షసాధింపు రాజకీయాలలో భాగంగా, గత ప్రభుత్వం దీర్ఘకాలంగా నిలిపివేసిన నీరు-చెట్టు బిల్లులు సైతం ఇందులో ఉన్నాయి. 4,600 కోట్ల రూపాయల బకాయిలను చెల్లించి మా ప్రభుత్వం నిలిచిపోయిన ప్రాజెక్టులను పునరుద్ధరించింది. మిగిలిన బిల్లులను కూడా త్వరలోనే చెల్లించనున్నాము.

59. పోలవరం ప్రాజెక్టు ప్రస్తుత మరియు భావితరాల ప్రజల జీవితాలను మెరుగుపరుస్తుందనీ, అలాగే రాయలసీమ ప్రాంతం మరియు ఉత్తర కోస్తా జిల్లాల భవితవ్యాన్ని మారుస్తుందనీ మా ప్రభుత్వం బలంగా విశ్వసిస్తోంది. భవిష్యత్తును తీర్చిదిద్ది, వ్యవసాయాన్ని పరిరక్షించి, మన రాష్ట్రాన్ని నీటిభద్రత గల కరువురహిత రాష్ట్రంగా మార్చే శక్తి ఈ ప్రాజెక్టుకు ఉంది. మా ప్రభుత్వం ఈ ప్రాజెక్టు మొదటి దశకు గాను కేంద్ర ప్రభుత్వం నుండి 12,157 కోట్ల రూపాయలను పొందగలిగింది. ఇప్పటి వరకు 73 శాతం పురోగతి సాధించిన ఈ ప్రాజెక్టు, 2027 నాటికి పూర్తి కానుంది.

60. గోదావరి జలాలు ఏటా దాదాపు 2 వేల టి.ఎం.సి.లు సముద్ర పాలవుతున్న పరిస్థితి ఓవైపు. నీరు లేక ఎడారిగా మారుతున్న రాయలసీమ

ప్రాంతం మరో వైపు. వృధా అవుతున్న నీటిని సద్వినియోగం చేసుకుంటూ ఆంధ్రప్రదేశ్ ను కరవు రహిత రాష్ట్రంగా మారుస్తూ.. **రైతుల జీవితాలలో వెలుగు నింపే దిశగా బృహత్తరమైన పోలవరం-బనకచెర్ల నదుల అనుసంధాన ప్రాజెక్టుకు మన గౌరవ ముఖ్యమంత్రి గారు శ్రీకారం చుట్టారు.** దీని కోసం ప్రణాళికలు రూపొందించే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ బృహత్తరమైన ప్రాజెక్టుకు అవసరమయ్యే వేల కోట్ల రూపాయలను సమకూర్చుకోవడానికి ఉన్న అన్ని అవకాశాలను గౌరవ ముఖ్యమంత్రి గారు అన్వేషిస్తున్నారు. దీంట్లో భాగంగా గోదావరి నది నుండి 200 టి.ఎం.సి.ల వరద నీటిని మళ్లించడం ద్వారా ఈ ప్రాజెక్టు సాకారం కావాలని.. చంద్రబాబుగారి కలలు నిజమవ్వాలని మనమందరం కోరుకుందాం.

61. పెండింగ్ బిల్లుల చెల్లింపులతోపాటు సుపరిపాలన అందించడం వలన పలు ప్రాజెక్టుల పురోగతి మళ్లీ పట్టాలెక్కింది. వీటిలో హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు వెడల్పు చేసే పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, చింతలపూడి ఎత్తిపోతల పథకం, స్టేజ్-IIలోని బొడ్డేపల్లి రాజగోపాలరావు వంశధార ఫేజ్-II పనులు వివిధ దశలలో ఉన్నాయి.

2025-26 ఆర్థిక సంవత్సరానికి జలవనరుల శాఖకు 18,019 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**పరిశ్రమలు మరియు వాణిజ్యం**

62. గత ప్రభుత్వ ఉదాసీన వైఖరి మరియు అసంబద్ధ విధానాల వలన పరిశ్రమలు మూతపడటంతో ప్రజలు ఉద్యోగాలు కోల్పోయి, అనేక

కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. రాష్ట్ర నుండి అనేక పరిశ్రమలు తరిమి వేయబడటంతో వ్యాపార వర్గాలలో భయాందోళనలు నెలకొన్నాయి. స్కూళ్లల్లో డ్రాప్ అవుట్స్ గురించి మనం వింటూ ఉంటాం అధ్యక్షా..! కానీ గత ప్రభుత్వంలో స్కూళ్లల్లో విద్యార్థుల డ్రాప్ అవుట్స్ సహజంగానే పెరిగాయి. ఇవే కాకుండా.. పరిశ్రమలు డ్రాప్ అవుట్ అయ్యాయి.. రాష్ట్రం నుంచి ఉద్యోగాలు డ్రాప్ అవుటయ్యాయి.. పేదలకు 'ఉపాధి' డ్రాప్ అవుట్ అయింది.. ఇన్ని రంగాలలో డ్రాప్ అవుట్లు కావడానికి మూల కారణమైన గత ప్రభుత్వ పాలకులు ఇప్పుడు ఓటమితో.. సభకు రాకుండా.. అసెంబ్లీ నుంచి కూడా డ్రాప్ అవుట్ అయ్యారు. వాళ్లు ప్రజా జీవితం నుంచి శాశత్వంగా డ్రాప్ అవుట్ అయ్యే రోజులు అతి త్వరలోనే ఉన్నాయి అధ్యక్షా..! అనేక పరిశ్రమలు, ఎమ్.ఎస్.ఎమ్.ఇ.లు, ఎస్.సి. మరియు ఎస్.టి. వర్గాలకు చెందిన వ్యాపారవేత్తలకు ప్రోత్సాహకాల కోసం ఇవ్వవలసిన 11,000 కోట్ల రూపాయలకు పైగా బకాయిలను గత ప్రభుత్వం నిలిపివేసింది. వీటిలో 377.73 కోట్ల రూపాయల బకాయిలను మా ప్రభుత్వం ఇప్పటికే చెల్లించింది.

63. ఒకప్పుడు వ్యాపారాన్ని సులభతరం చేయడం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) గురించి మాట్లాడుకున్నాం, కానీ ఇప్పుడు మన గౌరవ ముఖ్యమంత్రిగారు వ్యాపారాన్ని వేగవంతం చేయడం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పై దృష్టి సారించారు. ప్రతి ఇంటికీ ఒక ఐ.టి. ఉద్యోగి ఉండాలని అప్పట్లో మేము కృషి చేశాము. నేడు ఇంకొక ముందడుగు వేసి ప్రతి కుటుంబానికీ ఒక వ్యాపారవేత్త ఉండాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాము.

64. ఓర్వకల్లు, కొప్పర్తి అనే రెండు పారిశ్రామిక వాడలకు ఆర్థిక సహాయం అందించి అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం క్రింద మూలపేట, దొనకొండ, చిలమత్తూరు మరియు కుప్పం అనే నాలుగు కొత్త పారిశ్రామిక వాడలను ఎంపిక చేయడం జరిగింది.

65. పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడానికి మరియు దృఢమైన పెట్టుబడి వ్యవస్థను నెలకొల్పడానికి మా ప్రభుత్వం ముందు చూపుతో కూడిన అనేక విధాన పరమైన కార్యక్రమాలను ఆవిష్కరించింది. 4 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రధాన పెట్టుబడుదారులైన ఎన్.టి.పి.సి. గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ కంపెనీ, ఎన్.హెచ్.పి.సి., బి.పి.సి.ఎల్., రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్.జి. ఎలక్ట్రానిక్స్, టి.సి.ఎస్., టాటా పవర్, గ్రీన్‌కో గ్రూప్, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్, ఎకోరెన్ ఎనర్జీల నుండి మా ప్రభుత్వం 6.3 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి హామీలను సాధించగలిగింది. ఈ సందర్భంగా పెట్టుబడుల సాధనలో మంత్రి నారా లోకేష్ గారు గురించి ప్రత్యేకంగా చెప్పాలి అధ్యక్షా...! ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ కంపెనీ రాష్ట్రానికి వచ్చేలా చేయడంలో ఆయనదే కీలక పాత్ర. అలాగే ప్రతిష్టాత్మక సంస్థలకు చెందిన డేటా సెంటర్లను రాష్ట్రానికి వచ్చేలా చేసే విషయమై లోకేష్ గారు దృష్టి సారించారు.

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖకు 3,156 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**ఇంధన రంగం**

66. ప్రమాణ స్వీకారం చేసిన రోజునే గత ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో విద్యుత్ రంగం సర్వనాశనమైంది. అసమర్థ పాలన, పెరిగిన అప్పులు మరియు టారిఫ్ భారం కారణంగా, ఈ రంగం 1.29 లక్షల కోట్ల రూపాయలకు పైగా నష్టాలను చవిచూసింది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా రద్దు చేయడంతో మన రాష్ట్రం అధిక ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి వచ్చింది. దీనివలన ట్రూ-అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై పెనుభారం మోపబడింది.

67. గౌరవ ముఖ్యమంత్రిగారి దార్శనిక నాయకత్వంలో మన రాష్ట్ర ఇంధన రంగం నేడు పునరుజ్జీవం పొందుతోంది. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో 2030 నాటికి భారతదేశం యొక్క మొత్తం ఉత్పత్తిలో మూడింట ఒక వంతును సాధించాలనే ధ్యేయంతో మన రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మార్చడమే మా ప్రభుత్వ లక్ష్యం. **'ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024'** పునరుత్పాదక ఇంధన తయారీ జోన్‌లను ఏర్పాటు చేయడం ద్వారా ఇంధన రంగంలో పెట్టుబడులను ఆకర్షించి, 7.5 లక్షల మందికి ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఇంధన శాఖకు 13,600 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**రవాణా, రహదారులు మరియు భవనాలు**

68. గత పాలకుల నిర్లక్ష్యం మరియు నిర్వహణాలోపం వలన రాష్ట్ర రహదారులు అధ్వానంగా తయారవ్వడంతోపాటు ఉన్న మౌలిక సదుపాయాల పురోగతి కూడా కొన్ని సంవత్సరాల వెనుకకు మరలింది. రహదారుల పునరుద్ధరణకు చేపట్టిన **'మిషన్-గుంతలు లేని రహదారుల ఆంధ్ర'** (పాట్‌హోల్ ఫ్రీ ఆంధ్ర) గణనీయమైన పురోగతిని సాధించింది. **మరమ్మత్తులు చేపట్టిన 20,059 కిలోమీటర్లలో, 17,605 కిలోమీటర్ల మేర రహదారుల పనులు కేవలం మూడు నెలల వ్యవధిలోనే పూర్తిచేయడం జరిగింది.**

69. అదనంగా జిల్లా ప్రధాన కేంద్రాల నుండి మండల ప్రధాన కేంద్రాల వరకు మరియు వాటికి ఆనుకుని ఉన్న మండల ప్రధాన కేంద్రాల మధ్య రెండు వరుసల రహదారి అనుసంధాన పనులు చేపడుతున్నాము. వీటిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ మండల అనుసంధాన మరియు గ్రామ అనుసంధాన మెరుగుదల ప్రాజెక్టు మరియు ఆంధ్రప్రదేశ్ రహదారులు మరియు వంతెనల పునర్నిర్మాణ ప్రాజెక్టుల క్రింద 2,522 కిలోమీటర్ల రహదారుల విస్తరణ పనులు మరియు 464 వంతెనల నిర్మాణ/పునర్నిర్మాణ పనులు ఉన్నాయి.

2025-26 ఆర్థిక సంవత్సరానికి రవాణా, రహదారులు మరియు భవనాల శాఖకు 8,785 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**పర్యాటకం, క్రీడలు మరియు సంస్కృతి**

70. **'ఆంధ్రప్రదేశ్ పర్యాటక విధానం - 2024-29'** ద్వారా మా ప్రభుత్వం పర్యాటక రంగానికి పరిశ్రమ హోదాను కల్పించడం జరిగింది. అత్యంత పర్యావరణ

ప్రమాణాలతో కూడిన ప్రతిష్ఠాత్మక బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్‌ను రుషికొండ బీచ్ నిలుపుకుంది. దీనికితోడు అఖండ గోదావరి మరియు గండికోట వంటి ఐకానిక్ పర్యాటక ప్రాజెక్టులు పర్యాటకానికి అగ్రశ్రేణి గమ్యస్థానంగా రాష్ట్రం యొక్క ఖ్యాతిని ఇనుమడింపచేస్తున్నాయి. **'ఆంధ్రప్రదేశ్ క్రీడా విధానం 2024-29'** ద్వారా మెరుగైన క్రీడా సంస్కృతిని పెంపొందించడానికి మరియు క్రీడా నైపుణ్యాలను ప్రోత్సహించడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. క్షేత్ర స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించి, వారి క్రీడా శిక్షణను మెరుగుపరచడం ద్వారా, మన రాష్ట్రాన్ని క్రీడా ప్రతిభకు ప్రముఖ కేంద్రంగా నిలబెట్టడమే ఈ క్రీడా విధానం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

2025-26 ఆర్థిక సంవత్సరానికి యువజన, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖకు 469 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**గృహ మంత్రిత్వ శాఖ**

71. గత ప్రభుత్వం అనుసరించే విధానాలు పోలీస్ బలగాల స్థైర్యాన్ని దెబ్బ తీశాయి.. వారి సామర్థ్యాన్ని క్రుంగదీశాయి. దీని ఫలితంగా రాష్ట్రంలో అరాచకం రాజ్యం చేసింది. మాదక ద్రవ్యాలు అడ్డూ అదుపు లేకుండా తాండవించాయి. పోలీస్ బలగాల ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించడం కోసం 920 కోట్ల రూపాయల మేర పేరుకుపోయిన వివిధ బకాయిల నుంచి 250 కోట్ల రూపాయలను ఇటీవలే చెల్లించాం. గత ప్రభుత్వం రెండేళ్లుగా నిలిపివేసిన **గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీని** మా ప్రభుత్వం పునరుద్ధరించడం జరిగింది. **పోలీస్ దళం ఆధునీకరణ పథకం** (ఎం.ఓ.పి.ఎఫ్.) క్రింద 61.20 కోట్ల రూపాయలను విడుదల చేశాం.

72. శాంతిభద్రతలను బలోపేతం చేయడానికి మరియు ఉపాధిని కల్పించడానికి 6,100 మంది పోలీసు కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ జరుగుతోంది. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలసాగు మరియు వీటి అక్రమ రవాణాను నిరోధించడానికి **'ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఆఫ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్)'** ను మా ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగింది. సైబర్ నేరాల ముప్పు పెరుగుతుండటంతో ప్రతి జిల్లాలో ఒక సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతోంది. పోలీసు శాఖను మరింత చురుగ్గా తీర్చిదిద్దేందుకు, వాహనాల కొనుగోలుకు మా ప్రభుత్వం కృషి చేస్తోంది.

2025-26 ఆర్థిక సంవత్సరానికి గృహ మంత్రిత్వశాఖకు 8,570 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**రెవెన్యూ శాఖ**

73. గత ప్రభుత్వం **ఆంధ్రప్రదేశ్ భూహక్కు చట్టాన్ని** సరైన జాగ్రత్తలు తీసుకోకుండా హడావిడిగా తీసుకొచ్చింది. ప్రజలు నుండి వచ్చిన తీవ్రమైన ఒత్తిడి మేరకు ఈ చట్టాన్ని రద్దుచేసి భూ యాజమాన్యంపై ప్రజలకు ఉన్న భయాన్ని మా ప్రభుత్వం తొలగించింది. గ్రామస్థాయిలో భూసమస్యలను పరిష్కరించడానికి మా ప్రభుత్వం 17,403 గ్రామాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహించి ఇప్పటి వరకు 90,315 అర్జీలను పరిష్కరించడం జరిగింది. సుమోటో కుల ధృవీకరణ విధానం ద్వారా రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు కుల ధృవీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడం జరిగింది. ఫ్రీ-హోల్డ్ భూముల పునః పరిశీలన చేపట్టి పూర్తి చేశాము. రీసర్వే పూర్తయిన 6,688 గ్రామాలలో

గ్రామసభలను జరిపి ఫిర్యాదుల పరిష్కారానికి తాజా ప్రాదేశిక డేటాను నిర్వహించడం జరుగుతోంది.

**కార్మిక శాఖ**

74. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల భద్రత కోసం కుటుంబ యజమానికి **చంద్రన్న బీమా పథకం** అమలుకు సంబంధించిన విధివిధానాలను నిర్ణయించేందుకు వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేశాము. గుంటూరు, శ్రీసిటి, కర్నూలు, పెనుకొండ, అచ్యుతాపురం, శ్రీకాకుళం మరియు నెల్లూరులలో ఈ.ఎస్.ఐ. ఆసుపత్రుల నిర్మాణానికి భూములను గుర్తించడం జరిగింది. తిరుపతిలోని ఈ.ఎస్.ఐ. ఆసుపత్రిని 50 నుండి 100 పడకలకు పెంచడానికి ఆమోదించడం జరిగింది.

**ఇతర విధానాలు**

గౌరవ ముఖ్యమంత్రిగారి మార్గదర్శకత్వంలో ఈ క్రింది ముఖ్య విధానాలు మా ప్రభుత్వం తీసుకువస్తోంది.

**వయబులిటీ గ్యాప్ ఫండింగ్** (వి.జి.ఎఫ్)

75. ఆర్థిక శాఖకు సంబంధించి కొన్ని కీలక అంశాలు ప్రస్తావించాలి అధ్యక్షా..! బడ్జెట్ అనగానే రూపాయి రాక-పోక, కేటాయింపులు, అప్పులు, ఆదాయం, ఖర్చులు, లోటు, మిగులు, రెవెన్యూ వ్యయం, మూలధన వ్యయం. ఇవి సామాన్యునికి అర్థం కాని పడికట్టు పదాలు. ప్రజల కోసం పెట్టే బడ్జెట్‌ను ప్రజలకు అర్థం అయ్యేలా చెప్పాల్సిన బాధ్యత మనపై ఉంది అధ్యక్షా...!

76. గతంలో ఎన్నడూ లేని విధంగా మూలధన వ్యయం గురించి ఎక్కువగా చర్చ జరుగుతోంది అధ్యక్షా..! 'మూలధన వ్యయం' అంటే ఏంటనేది సామాన్యుని భాషలో చెప్పాలంటే.. ఒక రైతు భూమిని కొనడం మూలధన వ్యయం .. ఆ భూమిని సాగు చేసుకోవడానికి అవసరమైన బావి త్రవ్వడం.. బోరు వేయడం మూలధన వ్యయం. ఇలా ఆ రైతు పెట్టిన ఆ మూలధన వ్యయం వలన అతని పొలంలో పంటలు పండుతాయి.. ఆదాయం వస్తుంది. అలాగే ప్రభుత్వానికి మూలధన వ్యయం ఉంటుంది. సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాలు వంటి వాటిపై ఖర్చు చేస్తే... తిరిగి అవి ఆదాయాన్ని కల్పిస్తాయి. ఇదే నిజమైన మూలధన వ్యయ లక్ష్యం. ఒక ఉదాహరణ అధ్యక్షా..! 1600 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి.. కట్టిన పట్టిసీమ ప్రాజెక్టు ఈ రాష్ట్ర రైతాంగానికి ఐదేళ్లలో 44 వేల కోట్ల రూపాయలను సంపాదించే అవకాశాన్ని కల్పించింది. ఇది నిజమైన మూలధన వ్యయం... ప్రజలకు ఉపయోగపడే మూలధన వ్యయం. అందుకే మా ప్రభుత్వం దానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తోంది.

77. వందల కోట్లతో సముద్ర తీరాన ప్యాలెస్‌లు కట్టుకోవడం.. సర్వే రాళ్లపై బొమ్మలకే 650 కోట్ల రూపాయలు తగలెయ్యడం ప్రజలకు ఉపయోగడే మూలధన వ్యయం కాదు. ఇలాంటివి క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ లా కన్పించే పర్సనల్ ఎక్స్‌పెండిచర్. ఇదీ గత ప్రభుత్వ నిర్వాకం. హంద్రీ-నీవా లాంటి ప్రాజెక్టులపై మా ప్రభుత్వం డబ్బులు ఖర్చు పెట్టడం మూలధన వ్యయం. ఇది నాటి పాలకుల ఖర్చు పెట్టిన విధానానికి నేటి పాలకులు ఖర్చు పెడుతున్న విధానానికి ఉన్న వ్యత్యాసం. అదే రూపాయిని ఎవరు ఎలా ఖర్చు పెడుతున్నారనడానికి ఇదే ఉదాహరణ.

78. తక్కువ ఆదాయ వనరులున్న ప్రస్తుత పరిస్థితులలో పెద్ద పెద్ద క్యాపిటల్ ఎక్స్ పెడించర్ ప్రాజెక్టులు చేపట్టడానికి వచ్చే ఇబ్బందులను అధిగమించడానికి ప్రణాళికలు రూపొందించాం. **పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం (పి.పి.పి.)తో కొత్త అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రోత్సాహకంగా ప్రాజెక్టు వ్యయంలో 20 శాతం వరకు వయబులిటీ గ్యాప్ ఫండింగ్ కోసం.. ఓ వినూత్న పథకాన్ని ప్రవేశపెడుతున్నామని ప్రకటిస్తున్నాం. దీని కోసం 2 వేల కోట్ల రూపాయల కార్పస్ ఫండ్‌ను ప్రతిపాదిస్తున్నాను.**

**రియల్‌టైమ్ గవర్నెన్స్**

79. గత ప్రభుత్వ హయాంలో పారదర్శకత మరియు పాలనా సౌలభ్యం కొరవడ్డాయి. గూగుల్, టి.సి.ఎస్., మెటా తదితర సంస్థలతో మా ప్రభుత్వం అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకుంది. ఆరోగ్య సంరక్షణతోపాటు వివిధ రంగాలలో కృత్రిమ మేధస్సు వినియోగాన్ని వేగవంతం చేయడానికి గూగుల్ సంస్థతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం రాష్ట్రంలో స్టార్టప్ వ్యవస్థకు మద్దతునిస్తుంది. మెటాతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ద్వారా 159 సేవలతో **వాట్సాప్ గవర్నెన్స్‌ను** ప్రారంభించడం జరిగింది. వాట్సాప్ గవర్నెన్స్‌తో వీలైనన్ని ఎక్కువ పౌర సేవలను అనుసంధానం చేసేందుకు మా ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది.

**తెలుగు భాషాభివృద్ధి**

*ఆంధ్ర భోజుడిగా ప్రస్తుతించబడిన శ్రీకృష్ణదేవరాయల* వారి అమూల్యమైన పలుకులను గుర్తుచేసుకుందాం....

**"తెలుగ దేలయన్న దేశంబు తెలుగేను**

**తెలుగు వల్లభుండ తెలుగొకండ**

**ఎల్ల నృపులు గొలువ ఎరుగవే బాసాడి**

**దేశ భాషలందు తెలుగు లెస్స"**

గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారి మార్గదర్శకత్వంలో, వచ్చే ఆర్థిక సంవత్సరంలో వినూత్న ఆలోచనలతో మా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది.

80. శతాబ్దాల నాటి గొప్ప సాహితీ సంప్రదాయాన్ని కలిగిన ప్రాచీన తెలుగు భాష ఒకటి. భారతీయ సంస్కృతి, సాహిత్యం మరియు కళలకు తమ రచనల ద్వారా పలువురు తెలుగు కవులు, రచయితలు మరియు పండితులు చేసిన సేవ ఎనలేనిది. మన రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలో మరియు ప్రచారం చేయడంలో తెలుగు భాషకున్న ప్రాముఖ్యతను మా ప్రభుత్వం గుర్తించింది. తెలుగు భాష అభివృద్ధి మరియు ప్రచారం కోసం 10 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**నవోదయం 2.0**

81. అక్రమ మద్యం ఉత్పత్తిని నిర్మూలించడం కోసం 2016 సంవత్సరంలో అమలుపరచబడిన **'నవోదయం' కార్యక్రమం** విజయవంతమైంది. నేడు మన రాష్ట్రాన్ని అక్రమ మద్యం, మాదకద్రవ్యాలు మరియు గంజాయి రహిత రాష్ట్రంగా

మార్చాలనే ధ్యేయంతో మా ప్రభుత్వం **'నవోదయం 2.0'** కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆల్కహాల్ డీ-అడిక్షన్ కోసం పనిచేస్తున్న ప్రసిద్ధ సంస్థలతో కలిసి మా ప్రభుత్వం వ్యసనాలబారి నుండి ప్రజలను, ముఖ్యంగా యువతను రక్షించడానికి, అవగాహనా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనుంది. ఈ కార్యక్రమానికి 10 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్**

82. **రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌**ను మా ప్రభుత్వం అమరావతిలో ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, పారిశ్రామిక వ్యవస్థలను ఏర్పాటు చేయడం మరియు స్టార్టప్‌లకు మార్గదర్శకత్వం వహించడం జరగనుంది. ఈ హబ్ మరో ఐదు జోనల్ కేంద్రాలతో అనుసంధానించబడుతుంది. ప్రతి కేంద్రానికీ ఒక ప్రముఖ వ్యాపార సమూహం మద్దతు లభించడం వలన, అభివృద్ధి చెందుతున్న రంగాలలో సాంకేతికత మరియు నైపుణ్యాభివృద్ధి సులభతరం కానున్నాయి.

**కాలుష్య రహిత ఆంధ్ర**

83. దేశ రాజధాని ఢిల్లీలోని పరిస్థితిని చూస్తే కాలుష్య ప్రమాదం స్పష్టంగా కనిపిస్తుంది. మన రాష్ట్రం కాలుష్యం బారిన పడకుండా మా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. హరిత శక్తిని ప్రోత్సహించి మరియు రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడానికి మా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ చర్యలతో మన రాష్ట్రం **నెట్-జీరో ఎకానమీగా** మార్పు చెందడానికి మా ప్రభుత్వం కృషి చేస్తోంది.

**2023-24 ఖాతాలు :**

84. ఆంధ్రప్రదేశ్ అకౌంటెంట్ జనరల్ వారు ఖరారు చేసిన ఆర్థిక లెక్కల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రెవెన్యూ లోటు 38,682 కోట్ల రూపాయలు మరియు ద్రవ్యలోటు 62,719 కోట్ల రూపాయలుగా చెప్పడం జరిగింది. **రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తి (జి.ఎస్.డి.పి.) లో** రెవెన్యూ లోటు మరియు ద్రవ్యలోటు వరుసగా 2.72 శాతంగానూ, 4.41 శాతంగానూ ఉన్నాయి.

**2024-25 సవరించిన అంచనాలు**

85. సవరించిన అంచనాల ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ వ్యయం 2,24,342 కోట్ల రూపాయలు కాగా మూలధన వ్యయం 24,072 కోట్ల రూపాయలు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు దాదాపు 48,311 కోట్ల రూపాయలు కాగా, ఇదే కాలానికి ద్రవ్యలోటు దాదాపు 73,362 కోట్ల రూపాయలు. ఇవి **రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తి (జి.ఎస్.డి.పి.) లో** వరుసగా 3.01 శాతంగానూ మరియు 4.57 శాతంగానూ ఉన్నాయి.

**2025-26 బడ్జెట్ అంచనాలు**

86. 2025-26 ఆర్థిక సంవత్సరానికి, నేను 3,22,359 కోట్ల రూపాయల వ్యయాన్ని ప్రతిపాదిస్తున్నాను. ఇందులో రెవెన్యూ వ్యయం అంచనా 2,51,162 కోట్ల రూపాయలు మరియు మూలధన వ్యయం అంచనా 40,635 కోట్ల రూపాయలు. ఇదే కాలానికి రెవెన్యూ లోటు 33,185 కోట్ల రూపాయలు మరియు ద్రవ్య లోటు 79,926 కోట్ల రూపాయలుగా ప్రతిపాదిస్తున్నాను.

**రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తి (జి.ఎస్.డి.పి.)** లో రెవెన్యూ లోటు 1.82 శాతంగానూ మరియు ద్రవ్యలోటు 4.38 శాతంగానూ ఉండవచ్చు.

**ముగింపు**

87. గౌరవనీయ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారి నాయకత్వంలో మన రాష్ట్రం ఆరోగ్యవంతమైన, సుసంపన్నమైన మరియు సంతోషకరమైన సమాజ నిర్మాణ దిశగా ఒక నూతన శకానికి నాంది పలుకుతోంది. మా లక్ష్యం **'స్వర్ణాంధ్ర-2047'** ఎంతో ఆశావహం. ఇది కష్టతరమైనప్పటకీ, సాధ్యమే. గత ఏడాది నుండి మన రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిశీలపరివర్తన మనందరం ఆశావహదృక్పథంతో, ఆత్మవిశ్వాసంతో గర్వంగా ముందుకు సాగడానికి కావలసిన ప్రోత్సాహం ఇస్తోంది.

88. 1944లో సుభాష్ చంద్రబోస్‌గారు భారత జాతీయ సైన్య సభ్యులతో ఇలా అన్నారు.

**"నాకు రక్తాన్నివ్వండి, నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను"**

దేశ స్వాతంత్ర సాధనకు ఈ పిలుపు స్ఫూర్తినిచ్చింది. గొప్ప నాయకులు క్లిష్ట సమయాలలో తమ ప్రజలను ఉత్తేజపరిచి ఉజ్వల భవిష్యత్తు వైపుకు నడిపిస్తారు.

ఈ సందర్భంగా మహాకవి శ్రీశ్రీ గారి మాటలను గుర్తుచేసుకుందాం...

**"నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను**

**నేను సైతం విశ్వ వృష్టికి అశ్రువొక్కటి ధారపోశాను."**

ఇదే స్ఫూర్తితో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో నేను, మీరు, మనందరం మనవంతు తోడ్పాటు అందించి స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనను సాకారం చేసుకుందాం.

ఈ మాటలతో ఇప్పుడు మన రాష్ట్ర బడ్జెట్‌ను గౌరవ సభ ఆమోదం కోసం ప్రతిపాదిస్తున్నాను.

***జై ఆంధ్రప్రదేశ్***

***జై హింద్.***